క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణం కాపాడిన యువకుడు



రక్తదానం చేస్తున్న శివ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో రక్త హీనతతో బాధపడుతున్న గర్భిణి పువ్వల ప్రమీలకు రక్తదానం చేసి ఓ యువకుడు ఆమె ప్రాణాలు కాపాడాడు. వివరాలిలా ఉన్నాయి. ఆస్పత్రిలో గర్భిణికి రక్తం అవసరమని పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణకు ఆస్పత్రి సిబ్బంది బుధవారం తెలియజేశారు. ఈ విషయాన్ని వాట్సాప్ ద్వారా తెలుసుకున్న విశాఖపట్నం తానుబెల్లి ఫౌండేషన్ మెంబర్ పువ్వల శేషు వెంటనే స్పందించి పార్వతీపురం వైభవ్ జ్యూయలెర్స్‌లో ఉద్యోగం చేస్తున్న శివకు తెలియజేశారు. దీంతో ఆ యువకుడు వెంటనే స్పందించి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకుకు వచ్చి రక్తదానం చేసి గర్భిణి ప్రాణాలు కాపాడాడు. గర్భిణికి రక్తం అందించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందజేసిన తానుబెల్లి ఫౌండేషన్ సభ్యులు, రక్తదాత శివకు పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు అభినందనలు తెలియజేశారు.

14న అంబేడ్కర్ జయంతి

పార్వతీపురం: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతిని ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ సాధికారత ఇన్‌చార్జ్ అధికారి పి.శశిధర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ గిరిమిత్ర సమావేశమందిరంలో ఈ వేడుకను నిర్వహిస్తున్నామని కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.


ఘటాలతో భోగితల్లి తిరువీధి



ఘటాలతో తిరువీధిలో భోగితల్లి అమ్మవారు

సీతానగరం: మండలకేంద్రం సీతానగరం, పెదభోగిలి గ్రామదేవత భోగితల్లి అమ్మవారి ఘటాలతో బుధవారం రాత్రి తిరువీధి జరిగింది. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారిని కొనితేవడంతో పండగ ప్రారంభమైంది. మే నెల10వ తేదీన అమ్మవారి అనుపోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలియజేశారు. పెదభోగిలి, సీతానగరం, అప్పయ్యపేట, జోగింపేట, బుడ్డిపేట గ్రామాల్లో భోగితల్లి జాతర జరుగతోందని తెలిపారు.

ఉపాధి వేతనం కిట్టుబాటయ్యేలా పని



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ జాబు కార్డులున్న వేతనదారులందరికీ పనులు కల్పించి కిట్టుబాటు వేతనం వచ్చేలా సాంకేతిక సహాయకులు కృషి చేయాలని డ్వామా పీడీ కె రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం అమలు అధికార సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం మండల, క్లస్టర్ స్థాయి అధికారులు ఉపాధి కావలసిన వేతన దారులందరికీ పనులు కల్పించాలని సూచించారు. వేతనదారులు సమయ పాలన పాటించేలా అవగాహన కల్పించాలని, వేతనం రోజుకు రూ.272 కిట్టుబాటయ్యేలా పనికల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ భాను, ఈసీ కృష్ణ, టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణపోషణ యాప్‌లో హాజరు నమోదు

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీస్కూల్ పిల్లల హాజరును ప్రతీ రోజూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాలని భద్రగిరి సీడీపీఓ సీహెచ్ సుశీలాదేవి అన్నారు. ఈమేరకు బుధవారం తన కార్యాలయం వద్ద భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషణను అందివ్వాలని, వేసవి నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, హాజరును యాప్‌లో తప్పకుండా నమోదు చేయాలని సూచించారు.

గెడ్డలుప్పికి మహర్దశ

- గ్రామంలో అభివృద్ధి పనులు
- ప్రభుత్వానికి అండగా ఉంటామంటున్న గ్రామస్తులు

సీతానగరం:

గ్రామాల్లో అభివృద్ధి, ప్రజారోగ్యం, విద్యాభివృద్ధి విషయంలో పారదర్శకంగా ప్రజలకు సేవలందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. 2004-2009 పరిలనా కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.2.9 కోట్లతో సువర్ణముఖి నదిపై బగ్గందొర వలస-గెడ్డలుప్పి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి ఆనాటి ఎమ్మెల్యే ఆర్వీ సుజయ్‌కృష్ణ రంగారావు భూమి పూజ చేశారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు ప్రజల కష్టాలు, సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిర్వహించిన ప్రజాసంకల్పయాత్రలో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని, గెడ్డలుప్పి ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. అప్పట్లోనే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మనందరి ప్రభుత్వం వచ్చాక బ్రిడ్జి, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని భరోసా కల్పించారు.

గెడ్డలుప్పికి మంజూరుచేసిన నిధుల వివరాలు

ఎమ్మెల్యేగా ప్రమాణం అనంతరం అలజంగి జోగారావు గెడ్డలుప్పి ప్రజలకు ధన్యవాదాలు తెలియజేయడానికి వచ్చినప్పుడు రహదారి సౌకర్యం సక్రమంగా లేని విషయాన్ని గమనించి రూ.10 లక్షలతో కొత్తవలస జంక్షన్ నుంచి గెడ్డలుప్పి గ్రామం వరకూ గ్రావెల్ రోడ్డు పనులు చేయించారు. సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ 17 లక్షలు, రైతు భరోసా భవనం నిర్మాణానికి రూ.22 లక్షలు, ప్రహరీకి రూ.10లక్షలు, శ్మశాన వాటికకు సీసీ రోడ్డు, సీసీ కాలువ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు కావడంతో పనులు జరిగాయి. 2008నాటి ప్రభుత్వం సువర్ణముఖినదిపై బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసినా పనులు కాక రాకపోకలకు విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బ్రిడ్జికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేకించి రూ.13 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పనులు పూర్తికావచ్చాయి. బగ్గందొరవలస-గెడ్డలుప్పికి సువర్ణముఖినదిపై బ్రిడ్జి మీదుగా ప్రస్తుతం రాకపోకలు సాగుతున్నాయి.

గ్రామంలో ఇళ్ల నిర్మాణం

గ్రామంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలవారందరికీ 140 జగనన్న ఇళ్లు మంజూరుచేశారు. ప్రస్తుతం ఇళ్లనిర్మాణం జరుగుతోంది. అలాగే మన బడి నాడు నేడు పథకం ద్వారా రూ18 లక్షలతో పాఠశాల భవనాలు, రూ7.5 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మాణం జరిగాయి. రూ.10 లక్షలతో సీతానగరం సాగునీరు ప్రాజెక్టుకు సంబంధించిన 800 మీటర్ల కాలువలో పేరుకుపోయిన సిల్ట్ తీయడానికి, గండ్లు పూడ్చడానికి, మరమ్మతుల కోసం నిధులు మంజూరుచేశారు.



గెడ్డలుప్పిగ్రామం



సువర్ణముఖి నదిపై నిర్మించిన బ్రిడ్జి



జరుగుతున్న సచివాలయం పనులు



సర్వాంగ సుందరంగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు



ఇంటింటికుళాయిలు

ఇంటింటి కుళాయిలతో తీరిన కష్టాలు



గ్రామాన్ని ఆనుకుని ఉన్న జీవనదిగా పేరొందిన సువర్ణముఖిలో తాగునీరు కలుషితం కావడంతో అవస్థలు పడాల్సి వచ్చేది. ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా గ్రామంలో ఇంటింటి కుళాయిలు వేయడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామస్తులమంతా భవిష్యత్‌లో జగనన్నకు అండగా ఉంటాం.

అల్లు విజయలక్ష్మి, గృహిణి, గెడ్డలుప్పి

బ్రిడ్జి నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు



గ్రామానికి రహదారి సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. విద్యాపరంగా మాపిల్లలు వెనకబడ్డారు. బ్రిడ్జి నిర్మాణంతో దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు తొలగాయి. వివిధ కార్యాలయాల సేవలు సచివాలయంలోనే అందుతున్నాయి. మాసమస్యలు పరిష్కరించిన జగనన్న ప్రభుత్వానికి రుణపడిఉంటాం.

కర్రి రామస్వామి, రైతునాయకుడు, గెడ్డలుప్పి

ఎమ్మెల్యే కృషితో గ్రామాభివృద్ధి



గ్రామంలో ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రజల కష్టాలు తెలుసుకున్న అనతి కాలంలోనే కోట్లాది రూపాయల నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం తోడ్పడింది. మా గ్రామ ప్రజలందరం జగనన్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జోగారావుకు రుణపడి ఉంటాం.

తిరుపతినాయుడు, సర్పంచ్, గెడ్డలుప్పి

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఆరురోజులుగాఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్' 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జోగారావు ప్రభుత్వానికి ప్రజల మద్దతు కోరారు. మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో' జగనన్నే మా భవిష్యత్' 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చేకూరిన లబ్ధి, పొందిన ప్రయోజనాలతో పాటు గతప్రభుత్వంలో మోసపోయిన, మోసగించిన విధానాన్ని విడమరిచి రెండు ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసం వివరించారు. అలాగే ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచిన ఐదు ప్రశ్నలను నేరుగా అడిగి అవును అని సమాధానం చెప్పిన వారితో బుక్‌లో టిక్ మార్క్ పెట్టించి వారికి రసీదులు అందించారు. అలాగే వారి ఇంటి డోరుపై జగనన్నే మా భవిష్యత్ అనే స్టిక్కర్‌ను, ఫోన్‌పై స్టిక్కర్‌ను అతికించి వారితో కలిసి ఫొటోలు దిగారు. సీఎం జగన్ పాలనపై నమ్మకం ఉంచి భవిష్యత్‌లో కూడా మళ్లీ ఆయన పాలనే కావాలని, రావాలని ప్రజలు విశ్వసించడంతో పాటు ప్రభుత్వానికి మద్దతుగా వారి ఫోన్ల ద్వారా మిస్డ్ కాల్ ఇచ్చి వారి పూర్తిస్థాయి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, మాజీ జెడ్పీటీసీలు కృష్ణం నాయుడు, టీవీ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలనాయకులు పి ఈశ్వరనారాయణ, ఆర్వీ పార్థసారథి, సర్పంచ్ చింతాడ కృష్ణ, స్టేట్ డైరెక్టర్ ఎస్.తిరుపతి రావు, అంటిపేట ఉపసర్పంచ్ బి.తిరుపతి రావు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా శివరాంపురంలో సర్పంచ్ శ్రీనివాసరావు, కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్నతోనే అందరం కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల అమలుతో అందరం సుభిక్షంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం: లచ్చయ్యపేటలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



బలిజిపేట: శివరాంపురంలో ఇంటింటికీ తిరుగుతున్న కన్వీనర్లు, గృహసారథులు



సీతానగరం: లచ్చయ్యపేటలో జగనన్న స్టిక్కర్‌ను గోడకు అమర్చుకుంటున్న భార్యాభర్తలు

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలి

- గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం

సీతానగరం: పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మండల కేంద్రంలో మౌలిక వసతులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు పొందాలని కాలేజీ అధ్యాపకులు డి రామకృష్ణ, టి. రవికుమార్, ఎ.రామారావులు కోరారు. జిల్లా వృత్తివిద్య అధికారులు, ప్రిన్సిపాల్ బి.రేణుక సూచలనల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్‌కాలేజీ అధ్యాపకులు బుడ్డిపేట, సీతానగరం,పెదభోగిలి తదితర గ్రామాల్లో పదవ తరగతి పరీక్షలురాస్తున్న విద్యార్థుల ఇళ్లకు బుధవారం వెళ్లి ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాలు, అన్ని వసతులు, సీనియర్ అధ్యాపకులతో విద్యా బోధన, విద్యాబోధనకు అవసరమైన భవనాలు ఉన్నాయని తెలియజేశారు. అలాగే రైల్వేస్టేషన్, నాలుగు రోడ్లకూడలితో నిరంతరం రవాణా సౌకర్యం ఉంటుందని చెప్పారు. కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, సీఈటీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) కోర్సులలో జాయిన్ అవ్వాలని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యను పోత్సహించాలని కోరారు. అధ్యాపకులు ఆర్‌వీఎస్ ప్రసాదరావు, వినోద్, రమేష్, అరుణ్‌కుమారి, మయూరి విద్యార్థుల పేరెంట్స్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



బుడ్డిపేటలో పేరెంట్‌తో మాట్లాడుతున్న అధ్యాపకులు టి.రవికుమార్, రామారావు

మేలు చేసిన ప్రభుత్వానికి అండగా ఉండండి



నారాయణపురంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: పార్టీలకు అతీతంగా, నిరుపేదలు, అక్కా చెల్లెమ్మలు, వృద్ధులు, రైతులకు సంక్షేమ పథకాలు, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలం నారాయణపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి అని గ్రామస్తులకు చెప్పారు. నవరత్నాల్లాంటి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే అని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయో? లేదో అని పర్యవేక్షణ చేసి, ఎటువంటి లోపాలున్నా సవరించాలనే సంకల్పంతో ఎమ్మెల్యేలను గడప గడప ఎక్కించి ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవాలని ఆదేశించిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని అమలు చేస్తూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తున్న ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని ఇందుకోసం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసిందన్నారు. ప్రజలకు ఇన్ని రకాల సేవలు అందించి మేలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ రాధ, ఎంపీటీసీ శ్రీరామూర్తి, సర్పంచ్ కె.మోహనరావు, జగన్, ఎ.గౌరీశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో టీకాలు

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్:

హైరిస్క్ ప్రాంతాల్లో పిల్లలకు పూర్తి స్థాయిలో టీకాలు వేయడంపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన పట్టణ శివారు ప్రాంతాలను బుధవారం సందర్శించి పిల్లల టీకా కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేస్తూ ముఖ్యంగా మురికివాడలు, శివారు, మూల ప్రాంతాలు, వలస కార్మికులు, సంచార జీవనం గడిపేవారు, ఇటుక బట్టీ, గృహ నిర్మాణం కోసం తాత్కాలిక జీవనం సాగించే ప్రదేశాలు తదితర హైరిస్క్ ప్రాంతాలను సిబ్బంది గుర్తించి పై కారణాల వల్ల అక్కడ పిల్లల్లో ఎవరికైనా షెడ్యూల్ ప్రకారం టీకా వేయని పరిస్థితి ఉంటే వెంటనే వేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించి, ఆర్‌సీహెచ్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్ఎం దుర్గమ్మ , ఆశకార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో టీకాల కార్డులను పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

సూపర్‌స్పెషాల్టీ ఉచిత వైద్య శిబిరాలకు సిద్ధం

- పెద్దలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ సీఈవో తుమరాడ చంద్రమౌళి



పార్వతీపురంటౌన్:

పార్వతీపురం మన్యం జిల్లాలో సూపర్ స్పెషాలిటీ స్థాయిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ సీఈఓ తుమరాడ చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్య సేవలతో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను తమ క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాల్లో నిపుణులైన ప్రముఖ వైద్యుల సేవలతో పాటు కొన్నిరకాల మందులు అందజేసి, పరీక్షలు ఉచితంగా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం వేసవితో పాటు రానున్న వ్యాధుల సీజన్‌లో ప్రజలకు పలు రకాల రోగాలు ఆశించే అవకాశం ఉందన్నారు. అలాగే దీర్ఘకాలిక రోగులకు సైతం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తాను జిల్లాలోని కొమరాడ మండలం మాదలంగి గ్రామానికి చెందినవాడిని కావడంతో జిల్లా అంటే అమితమైన ఇష్టమన్నారు. ఈ నేపథ్యంలో తన వంతుగా జిల్లా ప్రజలకు వైద్య పరమైన సేవలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కావున జిల్లాలోని అధికారులు, రాజకీయ నాయకులు, పెద్దలు స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా ముందుకు వచ్చి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తే క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలకు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఎండ తీవ్రతపై అప్రమత్తం

- డీఎంహెచ్ఓ డాక్టర్ జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్: ఎండ తీవ్రత బాగా ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాథరావు హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా బయటకు రావడం తగ్గించాలని, ఇంటి వద్దనే ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో బయటకు పనికి వెళ్లేవారు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎండ ఎక్కువగా ఉండే సూచనలు ఉన్నందున ఆ సమయంలో సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండడం మంచిదన్నారు. బయటకు వచ్చే వారు తెల్లని వదులుగా ఉండే దుస్తులు ధరించాలని, గొడుగు లేదా టోపీ ధరించి బయటకి వెళ్లాలని సూచించారు. ఓఆర్ఎస్ కలిపిన నీళ్ల, కొబ్బరి నీళ్ల, పళ్ల రసాలు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎవరికైనా వడదెబ్బ తగిలి మూర్ఛపోయినా లేక అత్యవసరమైన పరిస్థితుల్లో దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను లేదా వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను సందర్శించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు.

రైతుల సమక్షంలోనే సర్వేరాళ్ల ఏర్పాటు

పాలకొండ: రైతుల సమక్షంలోనే సరిహద్దు రాళ్లను వేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వర రావు సర్వే సిబ్బందికి సూచించారు. మండల పరిధిలో సమగ్ర భూసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వేరాళ్లు ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. కొండాపురం, వెలగవాడ, తదితర గ్రామాల్లో జరుగుతున్న సరిహద్దు రాళ్ల ఏర్పాటును బుధవారం మండల సర్వేయర్ వెంకటరావుతో కలిసి పరిశీలించారు. రోజుకు వందకు తక్కువ కాకుండా రాళ్లు పాతించాలన్నారు. డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన హద్దుల మేరకు రాళ్లు వేయాలని సూచించారు.

అభివృద్ధికి ప్రాధాన్యం

- పలు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

పార్వతీపురంటౌన్:

అభివృద్ధి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల జగన్నాథపురంలోని వార్డులలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జోగారావు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ప్రధానంగా ఎర్రకంచమ్మ గుడి ఎదురుగా గల పురాతన మురుగు కాలువల స్థానంలో ఆధునిక సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. గుడి దగ్గరలో గల మంచినీటి సరఫరా ట్యాంక్‌ను ఆధునీకరించి అభివృద్ధి చేసేందుకు అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. కోనేటి సుందరీకరణ పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్‌లు అర్.చిన్నం నాయుడు, వై త్రినాథ, అర్.బంగారి నాయుడు, కో ఆప్షన్ సభ్యులు ఎం. వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బి.శ్రీదేవి, స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు